# ఎకనమిక్స్‌తో అవకాశాలెన్నో!

భారత్‌లో ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్నాక... కార్పొరేట్ ప్రపంచ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. బ్యాంకింగ్.. ఫైనాన్స్.. ఇన్సూరెన్స్.. కన్సల్టెన్సీ.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్.. షేర్స్, స్టాక్ మార్కెట్స్.. ఇలా అనేక రంగాలు కొత్త పుంతలు తొక్కాయి. వీటిల్లో అవకాశాలు విస్తృతమయ్యాయి. కొద్ది కాలంగా కార్పొరేట్ సంస్థలు.. ఎకనమిక్స్ విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నాయి. ప్రముఖ విద్యా సంస్థల్లో ఎకనమిక్స్‌లో డిగ్రీ, పీజీ చేస్తే అద్భుత అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి.

**కెరీర్-అవకాశాలు...** సరికొత్త రంగాలైన ఫైనాన్స్, బ్యాంకింగ్, పబ్లిక్ పాలసీ, డవలప్‌మెంట్ సెక్టార్, సోషియల్ వర్క్, జర్నలిజం, టీచింగ్, రీసెర్చ్, నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్... వీరికి మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. సబ్జెక్టు, స్కిల్స్ ఉంటే... లా, మేనేజ్ మెంట్, ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో కెరీర్ సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లోనూ ఉద్యోగాలు లభించే అవకాశముంది. ఇక బోధనలో ఆసక్తి ఉన్నవారు... ఎకనామిక్స్‌లో పీజీ, పీహెచ్‌డీ చేయడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగొచ్చు.

**జీతాలు భారీగానే:** ఎకనామిక్స్ అభ్యర్థులకు జీతభత్యాలు దాదాపు ఎంబీఏల స్థాయిలోనే ఉంటాయి. ఎందుకంటే... కార్పొరేట్ సంస్థల్లో ఎంబీఏలు చేసే పనే ఎకనామిస్ట్‌లు కూడా చేస్తారు. అంతేకాక.. ఎకనామిక్స్ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటే..ఫైనాన్స్, మేనేజ్‌మెంట్, డెవలప్‌మెంట్ స్టడీస్ లలో చేరొచ్చు.

**పేరున్నవి కొన్నే!:** మన రాష్టంలో, దేశంలో అనేక యూనివర్సిటీలు, విద్యా సంస్థలు... ఎకనామిక్స్‌లో డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిస్తున్న కొన్ని సంస్థల విద్యార్థులకే నేడు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. దేశ వ్యాప్తంగా అలాంటి ప్రముఖ కాలేజీలను వేళ్లపై లెక్క పెట్టవచ్చు. మన రాష్ట్రంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతోపాటు నిజాం కాలేజీ అందించే ఎకనమిక్స్ కోర్సులకు మంచి పేరుంది. అదే విధంగా దేశ వ్యాప్తంగా తీసుకుంటే... ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ప్రముఖమైనవి.

## ఆర్థిక మంత్రిత్వ శాఖలో జాబ్స్

ఆసియాలో అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అభివృద్ధి చెందుతోంది. నిపుణులైన ఎకనమిస్ట్‌లు, స్టాటిస్టిషీయన్‌ల గొప్ప నిర్ణయాల వల్లే ఇది సాధ్యమైందనే విషయం సాధారణ ప్రజానీకానికి తెలియదు. భారత ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఉన్నత స్థాయి పదవుల్లో చేరడానికి ఇండియన్ ఎకనమిక్ సర్వీస్/ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్‌ల ద్వారా మార్గం సుగమం చేసుకోవచ్చు.

## ఇండియన్ ఎకనమిక్ సర్వీస్

ఎకనమిక్స్/అప్లయిడ్ ఎకనమిక్స్/బిజినెస్ ఎకన మిక్స్/ఎకనోమెట్రిక్స్‌లలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఈ పరీక్ష రాయడానికి అర్హులు.

వెబ్‌సైట్: www.upsc.gov.in

## ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్

స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. వెబ్‌సైట్: www.upsc.gov.in

SAKSHI